
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
05 మే 2025 పేజీలు : 08 సోమవారం

## దేశానికి గర్వకారణం
### ఎన్‌సీసీ కేడెట్లు



2 లో

**10** ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ, నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్, క్యాంపు కమాండెంట్ గణేష్ గొదంగవే సారథ్యంలో.. ఎన్‌సీసీ 3వ వార్షిక శిక్షణా శిబిరం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం సరస్వతి నగర్ అక్షర విద్యాలయంలో ఏడు రోజులు నుంచి నిర్వహిస్తున్నారు.

## అభివృద్ధిని వైసీపీ అటకెక్కించింది

### మంత్రి పొంగూరు నారాయణ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

వ్యక్తులపై అక్రమకేసులు బనాయించడంపై పెట్టిన శ్రద్ధతో పదో వంతు దృష్టి కూడా విద్యాలయాలపై వైసీపీ ప్రభుత్వం పెట్టలేదని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఐదేళ్ల పాటు సాగిన జగన్ సర్కార్ అస్తవ్యస్థ పాలనతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో మూతపడ్డ వీఆర్ హైస్కూల్‌ని ఆధునీకరించి నిరుపేద విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామన్నారు. ఆదివారం మంత్రి నారాయణ వీఆర్‌సీ పాఠశాల పునర్నిర్మాణ పనులను కమిషనర్ నందన్‌తో కలిసి పరిశీలించారు. అన్ని తరగతి గదులను పరిశీలించి తగు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థుల ఆటపాటలకు అనుకూలంగా గ్రౌండ్‌లో ఉన్న పాత శిథిలమైన భవనాలను తొలగించి మైదానాన్ని నిర్మించాలని ఆదేశించామన్నారు. నెల్లూరు నగర నడిబొడ్డులో 3 షిఫ్టుల్లో 8 వేలకు పైగా విద్యార్థులు చదువుకున్న ప్రతిష్టాత్మక కాలేజీని గత ప్రభుత్వ నిర్వాహకులు నిర్వీర్యం చేశారన్నారు. గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి నగరంలోని పేదలు, నిరుపేదలకు ఉన్నతస్థాయి విద్యను అందిస్తామన్నారు. ఎన్‌సీసీ కంపెనీ ఆధ్వర్యంలో పునర్నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అన్ని పనులు అనుకున్న విధంగా పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభించే నాటికి పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామన్నారు. తొలి ఏడాదిలో 1000 మంది



పేదలకు అడ్మిషన్స్ కల్పిస్తామని, ఉచిత బస్సు, భోజన వసతితోపాటు సాయంకాలం ఆటపాటల అనంతరం స్నాక్స్ అందించి వారి ఇళ్ల వద్ద దించుతామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం పేదల అడ్మిషన్లు 2 వేలకు పెంచుతామన్నారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, స్థానిక కార్పొరేటర్లు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## వీపీఆర్‌ను అరెస్టు చేయాలి



- పెద్దమనిషి ముసుగు తీసి అక్రమ మైనింగ్ 'లక్ష్మీ క్వార్జ్ ప్రైవేటు లిమిటెడ్' పేరుతో కంపెనీ స్థాపించి ఎంపీ వేమిరెడ్డి డైరెక్టర్‌గా ఉన్నారు
- పేదవాళ్లపై కేసులు కడతారు.. ఎంపీపై మాత్రం కేసులు కట్టారా !
- మాజీ మంత్రి అనిల్ యాదవ్ ఘాటైన వ్యాఖ్యలు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ఫైర్ అయ్యారు. ఆదివారం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికలు గడిచి 10 నెలలు తర్వాత మీ ముందుకు వచ్చానన్నారు. అనిల్ ఎక్కడకు వెళ్ళిపోలేదు.. వ్యక్తిగత కారణాలలో కొన్ని రోజులు దూరంగా ఉన్నానని చెప్పారు. ఎన్నికలు గడిచాక అనిల్ కుమార్ యాదవ్ అక్రమ మైనింగ్ ద్వారా వేల కోట్లు రూపాయలు దోచుకున్నారని రాసినట్లు చెప్పారు. తమ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిపై అక్రమ కేసులు విషయం ఒకటి, రెండోది అక్రమ మైనింగ్‌పై కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే ఇల్లీగల్ మైనింగ్ జరిగిందని అధికారులు 255 కోట్ల రూపాయలు ఫైన్‌లు వేశారు.. ఆ ఫైన్‌లు ప్రభుత్వం వసూళ్లు చేసుకోవాలని చెప్పారు. అధికారులు తనిఖీలు అనంతరం కొత్తగా మైన్‌లు ఏమన్నా ఓపెన్ చేసారా ? పెనాల్టీలు ఉన్న మైన్‌లు మాత్రమే ఓపెన్ చేశారని పేర్కొన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై 150 నుండి 200 మైన్‌లుంటే యాక్టివ్‌గా 100 మైన్‌లున్నాయి, కానీ కేవలం సెలెక్టివ్‌గా 30 మైన్‌లు మాత్రమే ఎందుకు ఓపెన్ చేశారని వివరించారు. గతంలో ప్రభుత్వానికి రూ.300 కోట్లు ఆదాయం వస్తే.. ఇప్పుడు 30 కోట్లు కూడా రావడం లేదని తెలిపారు. లారీడ్రైవర్‌లు, కూలి పనుల చేసుకునేవారు, రైతులు, మైనింగ్ యజమానులు రోడ్డున పడ్డారు. మైనింగ్ పరిశ్రమపై బతికే 10 వేల కుటుంబాలు

-మిగతా 2లో



కోవూరు నియోజకవర్గ పరిధిలో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా 2.12 కోట్ల ఆర్థిక సహాయం అందించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

### ప్రజల ఆరోగ్య పరిరక్షణే.. కూటమి ప్రభుత్వ
## తొలి ప్రాధాన్యత

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందివ్వాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లోని తన కార్యాలయంలో ఆమె కోవూరు నియోజకవర్గ పరిధిలో 6 మందికి

- 2లో

# దేశానికి గర్వకారణం - ఎన్‌సీసీ కేడేట్లు



వెంకటాచలం, మేజర్‌న్యూస్ : 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ, నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్, క్యాంపు కమాండెంట్ గణేష్ గొదంగవే సారథ్యంలో.. ఎన్‌సీసీ 3వ వార్షిక శిక్షణా శిబిరం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం సరస్వతి నగర్ అక్షర విద్యాలయంలో ఏడు రోజులు నుంచి నిర్వహిస్తున్నారు. క్యాంపులో శారీరక వ్యాయామం, యోగాసనాలు, షిప్ మోడలింగ్, ఆయుధ శిక్షణ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఎన్‌సీసీ జనరల్, సోషల్ అవేర్నెస్, పేరెడ్ ట్రైనింగ్, డిజాస్టర్ మేనేజ్ మెంట్, సీమాన్ షిప్,నేవల్ ఓరియంటేషన్, సీమాఫోర్, యాంకర్ వర్క్, కమ్యూనికేషన్, తదితర విషయాలపై శిక్షణ నిచ్చారు. సోషల్ అవేర్నెస్, కమ్యూనిటీ డెవలప్మెంట్, జాతీయ సమైక్యత, సామాజిక అవగాహన, సామాజిక అభివృద్ధి తదితర అంశాలపై శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా క్యాంపు కమాండెంట్ గణేష్ గొదంగవే మాట్లాడుతూ.. కేడేట్లు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకుని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని, ప్రతి క్యాడేట్ దేశానికి ఉపయోగపడే విధంగా క్రమశిక్షణ, సేవా భావంతో మెలగాలని దేశ సమగ్రతకు, దేశ రక్షణకు బాధ్యం నుంచే ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎన్‌సీసీ క్యాడేట్లు అయినందుకు మీరు గర్వపడాలని, మీ సేవలతో దేశానికి గర్వకారణంగా నిలవాలన్నారు. ప్రతి రోజు సాయంత్రం ఆటలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కేడేట్లలోని అంతర్గత శక్తులను వెలికితీసి వారి అభిరుచులను ఆశక్తులను గుర్తించి వారిలో దాగున్న సృజనాత్మకతకు మెరుగులు దిద్దుతున్నారు. శిక్షణా కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాంపు అడ్జటెంట్ ఆఫీసర్ గుండాల నరేంద్ర బాబు, సబ్ లెఫ్టినెంట్ మల్లికార్జున రెడ్డి, థర్డ్ ఆఫీసర్లు మస్తానయ్య, కొండారెడ్డి, విద్యాసాగర్, అరోరా, సాయి శంకరి, దివ్య, పీఐ స్టాఫ్ వైకుంఠం చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, పెట్టీ ఆఫీసర్లు రంజన్, లోకేష్, లక్ష్మణ్, దీపక్, వెంకటేష్, రమణారావు, నవీన్, ఈశ్వరరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ ముకుందసాగర్, షిప్ మోడలింగ్ ఇన్‌స్ట్రక్టర్ రామన్, ఎన్‌సీసీ కేడేట్లు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యత



*(మొదటి పేజీ తరువాయి)*

6 లక్షల 46 వేల 553 వందల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలలు వ్యవధిలో 153 మంది అనారోగ్య బాధితులకు 2 కోట్ల 12 లక్షల 73 వేల రూపాయలు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనన్నారు. అనారోగ్యాల బారినపడి కష్టాలలో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం కొండంత అండగా నిలుస్తుందన్నారు. సీఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా వేలాది కుటుంబాలను ఆదుకుంటూ.. మానవత్వం చాటుకుంటున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆమె కొనియాడారు. సీఎంఆర్ ఎఫ్ పథకం ద్వారా నిరుపేదలకు ఆర్థిక భరోసా అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోవూరు ప్రజానీకం తరుపున ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు ఇంత మల్లారెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, మోర్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

## పార్కులలో వసతులు కల్పించండి



నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ : పట్టణ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఆలోచనల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కులలో జిమ్ పరికరాలు, పచ్చదనం, పెయింటింగ్ తదితర మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ ఆదివారం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 23వ డివిజన్ స్థానిక జీవీఆర్ఆర్ కళాశాల సమీపంలోని కళ్యాణ్ నగర్ పార్కును పరిశీలించి పార్కులో నూతనంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక పార్కును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. జూన్ 15 నాటికి నెల్లూరు నగరంలో అన్ని పార్కులను సుందరంగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. అనంతరం స్థానిక రంగనాయకులపేట తిక్కన పార్కు, ఎఫ్‌సీఐ కాలనీలోని 2 పార్కులు, వేపదరువు ప్రాంతంలోని పార్కును కమిషనర్ సందర్శించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కులను అభివృద్ధి చేసి పార్కులలో అవసరమైన ఆట వస్తువులు, క్రీడా పరికరాలు, వ్యాయామ సౌకర్యాలను, పాదచారుల ట్రాక్, పచ్చదనం, పెయింటింగ్, బెంచీలు తదితర మౌళిక సదుపాయాలను కల్పించి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. అన్ని పార్కులను అభివృద్ధి చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తేనున్నామని కమిషనర్ వెల్లడించారు. స్థానిక సంతపేట మార్కెట్‌లోని చికెన్ షాపులో అపరిశుభ్రమైన వాతావరణంలో చికెన్ విక్రయాలు జరుగుతుండటాన్ని గమనించిన కమిషనర్ షాపు నిర్వాహకులకు 5 వేల రూపాయల జరిమానా విధించారు. పరిశుభ్రతను పాటించకుండా, నిర్దేశించిన ప్రమాణాలను ఉల్లంఘిస్తే షాపులను సీజ్ చేస్తామని కమిషనర్ దుకాణదారులను హెచ్చరించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని, ప్రతి ఒక్కరు తమ స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, గేటు ఏర్పాటు, తగిన రక్షణ చర్యలను తీసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు దోహదపడాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఈఈలు రహంతు జానీ, డీఈ రఘురాం, అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వీపీఆర్‌ను అరెస్టు చేయాలి

*(మొదటి పేజీ తరువాయి)*




రోడ్డు మీద పడ్డారని తెలిపారు. గతంలో మైనింగ్‌లో జరిగిన తప్పు ఒప్పులు గురించి నేను మాట్లాడను.. మైన్ ఓనర్లు కోర్టుకు వెళితే, ఫిబ్రవరిలో మైన్‌లు ఓపెన్ చేయాలని కోర్టు ఆదేశిస్తే అడ్డుకున్నారన్నారు. ఇప్పుడు మైన్ ఓనర్లు కంటెంట్ కింద కోర్టుకు వెళ్ళారు.. గతంలో వైసీపీ హయాంలో ఎప్పుడూ మైన్ ఓనర్లు కోర్టుకు వెళ్లలేదని చెప్పారు. మైనింగ్ పరిశ్రమ ఓపెన్ చేయనీయకుండా, ఇతరులకు పర్మిట్లు రాకుండా చూస్తున్నారన్నారు. తనకు వ్యక్తిత్వంగా ఎవరి మీద శత్రుత్వం లేదన్నారు. మైనింగ్ పరిశ్రమ ఓపెన్ చేయాలని ప్రభుత్వం అధికారులను, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని కలిస్తే తొందర్లో లక్ష్మీ క్వార్ట్జ్ ప్రైవేటు లిమిటెడ్ అనే పేరుతో కంపెనీ స్థాపించి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి డైరెక్టర్‌గా ఉన్నారని, ఆ కంపెనీ మాత్రమే ఎక్స్‌పోర్టు చేస్తుందని చెప్పారు. తర్వాత ఫినీ క్వార్జ్ పేరుతో మరో కంపెనీ స్థాపించి మొత్తం ఒక్కరే ఎక్స్‌పోర్టు చేస్తున్నారన్నారు. ఈ రెండు కంపెనీ లు స్థాపించి వారికి సరెండర్ చేసిన మైన్‌లో నుండి సరుకు మాత్రం బయట వెళుతుందని, మిగతా మైన్‌లు మూతబడ్డాయని చెప్పారు. 20 నిండి 30 ఎక్స్‌పోర్టు కంపెనీలు అన్ని ఆగిపోయి ఒక్క అధికార పార్టీకి చెందిన ఎంపీకి చెందిన ఎక్స్‌పోర్టు కంపెనీ సరుకు మాత్రమే బయట వెళుతుందన్నారు. శతాబ్దాలు చరిత్ర కలిగిన వెంకటగిరి రాజా కూడా మైన్ ఓపెన్ చేయాలని తెలిపారు. మైన్ ఓనర్లు కన్నా.. దాని మీద బతికే పేదవాడి కడుపు మీద కొట్టిన పాపం ఊరికే పోదుని చెప్పారు. గతంలో 250 కోట్లు ఫైన్ వేశారు. శోభారాణి మైన్‌కు 32 కోట్లు ఫైన్ వేశారు.. ఈ మైన్ ఇల్లీగల్ అని వెంకటగిరి ఎమ్మెల్యే ప్రెస్‌మీట్ పెట్టారన్నారు. నెల్లూరు డీడీ ఎంత దారుణంగా ఉన్నాడంటే.. ఆయన మొదట ఏడీగా ఉన్నప్పుడు 38 వేల మెట్రిక్ టన్నులు ఉందని తహసిల్దార్, ఆర్ఐలు అందరూ పంచనామ రాశారని, కానీ ఇదే డీడీ వచ్చాక మైనింగ్ చేయకుండానే లక్షా 20 వేల టన్నులు ఉందని రిపోర్ట్ ఇచ్చారంటే ఏమి చెప్పాలని ప్రశ్నించారు. సిద్ధి వినాయక, శ్రీనివాస పద్మావతి, శోభారాణి మైన్‌లు 50 సంవత్సరాలు గడిచిపోయిన వాటిని ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోలేదన్నారు. లీజు ముగిసిన మైన్‌లలో మెటీరియల్ ప్రభుత్వం ఆక్షన్ పెట్టాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, ప్రస్తుతం అక్కడ సరుకు లక్షల టన్నులు ఉందని, దాని విలువ మార్కెట్ పరికరం 800 నిండి 2 వేల కోట్లు రూపాయలు వరకు ఉందన్నారు. ఆ డబ్బులు రాజధాని అమరావతి కోసం వినియోగపడుతుందని తెలిపారు. మైన్‌లో ఇల్లీగల్ జరుగుతుందని పత్రికా మిత్రులు వెళితే.. అక్కడ గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్ లు కాపాలా కాస్తున్నారన్నారు. అమరనాథ్ రెడ్డి అనే వ్యక్తిపై ఈ ప్రభుత్వంలో అక్రమ మైన్ చేస్తున్నారని కేసులు పెట్టారని, ఇప్పుడు అతనే అక్కడ ఇల్లీగల్ మైన్ చేస్తున్నారన్నారు. జిల్లా ఎస్పీ ఎవరినైనా మఫ్టీలో పంపితే.. అక్కడ పరిస్థితులు తెలుస్తాయన్నారు. అక్రమ మైనింగ్ ఆపాలంటూ ఒక మహిళ పోరాటం చేస్తున్నారని, సైదాపురం ఎస్ఐ దారుణంగా ప్రవర్తిస్తున్నారని, దారుణంగా దారినిపో యే వారిని గంజాయి బ్యాచ్‌లు ఆపి అక్రమాలు చేస్తుంటే.. ఎస్ఐకు కనిపించవా ! అని ప్రశ్నించారు. వీపీఆర్‌కు 5 వేల కోట్లు ఉందో.. 3 వేల కోట్లు ఉందో.. తెలియదు కానీ, పేదల ఉసురు తగులుతుందని చెప్పారు. మైనింగ్‌లో వేమిరెడ్డి మోనో పోలిలాగా పని చేస్తున్నారని, ఇంత చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిపై ఎందుకు కేసు పెట్టకూడదని కోరారు. పేదోడిపై, రైతులపై కేసులు కడుతున్నారు కానీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిపై ఎందుకు కేసు కట్టకూడదని ప్రశ్నించారు. ఒక ఎంపీగా ఇంత అక్రమాలు జరుగుతున్నా.. ప్రజా ప్రతినిధిగా వేమిరెడ్డి ఎందుకు ఖండించడం లేదన్నారు. వేమిరెడ్డి ఏమన్నా భగవంతుడా ? వేమిరెడ్డి నేరుగా నాకు సంబంధం లేదని చెప్పమనండి అంటూ సవాల్ విసిరారు. మరో 5 రోజుల్లో అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోకపోతే.. నేనే అక్రమ మైనింగ్ వద్దకు వెళతానని తెలిపారు. వీళ్ళు ఇదేవిధంగా ఇల్లీగల్‌గా మైనింగ్ చేస్తామంటే అక్కడ ఉన్న స్థానికులందరూ మైనింగ్ చేసుకుంటా రని, ఎండీఎల్ ఉన్నవారు అందరికీ లక్షల రూపాయలు పెనాల్టీ లు వేశారని, కోటీశ్వరులకు మాత్రం పెనాల్టీలు లేవన్నారు. ఎండిఎల్ పెట్టు కుని మైనింగ్‌లో ఇబ్బంది పడుతున్న వారిలో 70 శాతం మంది తెలుగు దేశం పార్టీ వారేనన్నారు. రాజకీయ నాయకులు ఎన్నో మాట్లాడతారు కానీ, చివరగా పేదవారు నష్టపోతున్నారని పేర్కొన్నారు.

# విద్యార్థులకు చదువు వెలకట్టలేని తరగని సంపద

**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులైన తటవర్తి రమేష్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కార్యాలయంలో ఆర్యవైశ్య విద్యార్థులైన పదో తరగతిలో మెరిట్ సాధించి ప్రతిభను కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు, ఇంటర్మీడియట్లో మంచి మార్కులు సాధించి ఘనత తెచ్చిపెట్టిన ఆర్యవైశ్య విద్యార్థిని విద్యార్థులకు కావలి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఆర్యవైశ్య భవన్లో పాల్గొన్నారు. ఒక వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ నుంచి ఒక క్రమశిక్షణ కలిగి సైనికుడిలా చదువుతూ ఉంటే ఆ చదివే వారిని ఒక ఉన్నత స్థాయికి తీసుకు వెళుతుందని ఆ చదివే ఆ విద్యార్థి యొక్క సంపద, ఆస్తి, ఐశ్వర్యం అవుతుందని ఆ చదువుని ఎవరు కూడా ఈ ప్రపంచంలో దొంగలింపలేరని వారు తెలిపారు. చిన్న వయసు నుండి తల్లిదండ్రులకు విధేయత చూపిచ్చు గురువులను గౌరవిస్తూ క్రమశిక్షణ కలిగిన విద్యార్థిగా మంచి లక్షణాలు కలిగి మంచి ప్రవర్తన కలిగి జీవించాలని విద్యార్థిని విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఉద్దేశించి తెలిపారు. అలాగే విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు హితబోధ చేశారు. పిల్లలను ఎక్కువ సమయం చదువుని కేటాయించే విధంగా వారిపై ఉపాధ్యాయులే కాకుండా తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలని పిల్లలకు మంచి భవిష్యత్తును అందించాలని వారు తెలిపారు. చదువుల తల్లి విద్యార్థినీ విద్యార్థులకు ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని వాళ్ళని ఆశీర్వదించారు. అలాగే ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్యవైశ్య సంఘం తరపున ఇలాంటి చేయూతని ఇవ్వడం గొప్ప కార్యం అని వారు ఆర్యవైశ్య సంఘం నాయకులను ప్రశంసించారు. విద్యార్థిని, విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి ఉన్నత స్థితిలో ఉండాలని అలాగే గురువులకు చదువుకున్న పాఠశాలలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని వారు తెలిపారు. అనంతరం ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు తటవర్తి రమేష్ మాట్లాడుతూ, కావలి పట్టణ ఆర్యవైశ్య విద్యార్థిని విద్యార్థులకు ఆర్యవైశ్య సంఘం ఎప్పుడు



పేదవారికి తోడుగా ఉంటుందని ఆర్యవైశ్యులు అన్ని రంగాలలో రాణించాలని,మా కమిటీ సభ్యులు అందరూ కలిసి ఒక నిర్ణయం తీసుకొని ఇటువంటి ప్రోత్సాహకాలు ఆర్యవైశ్యులకి ఇవ్వడం ద్వారా వారు ఇంకా ఉన్నత చదువులు చదివేందుకు చేయూతనవుతుందని తెలిపారు. ప్రతి ఆర్యవైశ్యవిద్యార్థిని, విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి, మంచి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేయాలని కష్టపడి ఇష్టముతో చదువుకోవాలని రాబోయే రోజుల్లో మంచి ఉన్నత ఉద్యోగాల్లో మిమ్మల్ని చూడాలని ఆ ఆశ నాకు ఉందని వారు తెలిపారు. అనంతరం మా ఆర్యవైశ్య సంఘం తరపున పేద ఆర్యవైశ్యులకు చదువు కొరకు సహాయం చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నామని విద్యార్థినీ, విద్యార్థులు కూడా భవిష్యత్తులో మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆ దేవుడు మీకు ఎప్పుడు తోడుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కమిటీ సభ్యులు వీవీ సునీల్ కుమార్ గుప్తా, ఓరుగంటి రామకృష్ణ, గాదం శెట్టి మధుసూదన్, కావలి పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఉదయగిరి మెట్ట ప్రాంతానికి ఆపద్బాంధవుడు వీపీఆర్

- వీపీఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్ ప్రారంభం
- వీపీఆర్ అమృత మెట్ట ప్రాంతానికి ఒక వరం
- దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** వీపీఆర్ అమృత ధార మెట్ట ప్రాంతానికి ఆపద్బాంధవుడు అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటుచేసిన అమృత ధార వాటర్ ప్లాంట్‌ను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర కంచర్ల శ్రీకాంత్ చేతుల మీదగా ప్రారంభించారు. అనంతరం మహిళలకు బిందెలతో నీటిని అందజేశారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి మాట్లాడుతూ.. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా జిల్లావ్యాప్తంగా సుమారు 200కు పైగా వీపీఆర్ అమృత దార పేరుతో నెలకొల్పడం జరిగిందన్నారు. వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన తర్వాత దాని మరమ్మత్తుల ఖర్చులు కూడా విపిఆర్ ఫౌండేషన్ భరిస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించడం కోసం వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఎక్కువగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో ఫ్లోరిన్ అధికంగా ఉందని కిడ్నీ వ్యాధిగ్రస్తులు కూడా రోజురోజుకు పెరుగుతున్నారన్నారు. అందుచేత అవసరమైన చోట్ల విపిఆర్ ఫౌండేషన్ ద్వారా మరిన్ని వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తానని ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఉదయగిరి ప్రాంతాన్ని అక్కున చేర్చుకొని అడిగిన వెంటనే ఆపద్బాంధవుడు వలె విపిఆర్ అమృతధారను అందిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మీ నాయుడు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నుబోయిన చంచల్ బాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, వరికుంటపాడు మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు, తెలుగు యువత అధ్యక్షులు ముజ్జే లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, సీనియర్ నాయకులు ఉండేలా గురువారెడ్డి, దుత్తలూరు కన్వీనర్ వెంకటరత్నం, ఉదయగిరి కన్వీనర్ సిహెచ్ బయన్న, వనిపెంట సుబ్బారెడ్డి, జూపల్లి రాజారావు, గణపం సుదర్శన్ రెడ్డి, మంచాల శ్రీనివాస్ నాయుడు, వింజమూరు మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య కాకర్ల వెంకట్ కడియాల వెంకటేశ్వర్లు తాటికొండ అనూష మాజీ జెడ్పిటిసి సభ్యులు కలివేల జ్యోతి చీకుర్తి రవీంద్రబాబు లెక్కల వెంగళరెడ్డి కార్యకర్తల, అభిమానులు పాల్గొన్నారు.



# దత్తాత్రేయ అలంకారంలో పరమేశ్వరుడు

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం మూలాపేట నందు స్వయంభుగా వెలసిన ఈ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం నందు స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం వైశాఖ శుద్ధ పంచమి నుండి వైశాఖ శుద్ధ చతుర్దశి వరకు వసంతోత్సవాలు వైభవంగా నిర్వహించబడుతున్నాయి. వైశాకములో వసంతోత్సవం చేయుట అనాదిగా ఆచారంలో ఉన్నది. ఈ వసంత ఋతువులో పాడి పంటలు సమృద్ధిగా ఉండుట కొరకు ధనధాన్యాలు, వాస్తు వాహనములు, అష్టైశ్వర్యములు కలిగి ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లడం కొరకు ఈ వసంతోత్సవాలు జరుపుతున్నారు. ఇట్టి వైశాఖమాసంలో శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్యులు రామానుజా చార్యులు వంటి వారు జన్మించారు. వారి దివ్య అనుగ్రహం పొందడం విశేషం. వసంతోత్సవంలో భాగంగా ఆదివారం స్వామి వారు దత్తాత్రేయ అవతారంలో దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంకు ఉభయకర్తలుగా వడ్లమూడి సక్కుబాయి జ్ఞాపకార్థం కుమారుడు వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ఈ వేడుకలు తిలకించడానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. దేవస్థానం వారు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## ఆయుష్ వైద్య సేవలు

# అందుబాటులోకి తీసుకు రావాలి

- మంత్రిని కలిసిన బీజేపీ నేత డాక్టర్ మహేంద్ర యాదవ్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** జాతీయ ఆరోగ్యం మిషన్ (నేషనల్ హెల్త్ మిషన్) ద్వారా రాష్టంలో అన్ని ప్రాథమిక వైద్య కేంద్రలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, బోధన ఆసుపత్రులలో ఆయుష్ (ఆయుర్వేద హెూమియోపతి) వైద్య సేవలు అందుబాటులోకి తీస్కొని వచ్చి రోగులకు సైడ్ ఎఫెక్ట్స్ లేని దేశీయ సంప్రదాయ వైద్య విధానం ద్వారా వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కి బీజేపీ డాక్టర్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ మహేంద్ర యాదవ్ వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ గైడ్ లైన్స్ పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజిన్ సర్కార్‌లో ప్రజలకి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆయుష్ శాఖ అభివృద్ధి కోసం మంత్రి సత్యకుమార్ యాదవ్ కృషి చేస్తున్నారని.. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆయుర్వేద హెూమియోపతి మండళ్లు మంత్రి ప్రత్యేక చొరవతో ఏర్పడ్డాయాని వారి కృషి అభినందనీయమని అన్నారు.

# అంకాలమ్మ సన్నిధిలో అతిరథ మహారథులు



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహెూత్సవం గత మూడు రోజులుగా అత్యంత భక్తి శ్రద్ధలతో పురోహితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్‌లు అమ్మవారి సన్నిధికి చేరుకొని గ్రామదేవత శ్రీ అంకాలమ్మ తల్లి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం పురోహితులు గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందు ధర్మవరం గ్రామంలో అతిరథ మహారథులకు భాజా భజంత్రీలు, బాణా సంచాలు, పేలుస్తూ పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. అతిరథ మహారథులకు గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం చత్రపతి వీర శివాజీ విగ్రహానికి, తెలుగుదేశం వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగుదేశం జిందాబాద్, చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలి. ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. సమిష్టిగా ఐకమత్యంతో గ్రామ దేవత శ్రీ అంకాలమ్మ తల్లి ఆలయాన్ని అత్యంత సుందరంగా నిర్మించినందుకు గ్రామస్తులందరిని అభినందించారు. ఆలయం వరకు సిసి రోడ్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు. మెట్ట ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని రానున్న రోజుల్లో ఉదయగిరిని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మీ నాయుడు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నుబోయిన చంచల్ బాబు యాదవ్ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు, తెలుగు యువత అధ్యక్షులు ముజ్జే లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, నాదెండ్ల రాజా, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, వింజమూరు మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య కాకర్ల వెంకట్ కడియాల వెంకటేశ్వర్లు, గణపం సుదర్శన్ రెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు, ఉదయగిరి మండల కన్వీనర్ సిహెచ్ బయన్న చీకుర్తి రవీంద్రబాబు కార్యకర్తల అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కనుమరుగవుతున్న తాంబూలం

- నానాటికి తరుగుతున్న విస్తీర్ణం
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- రవాణా సౌకర్యం లేని పరిస్థితి
- నిరాశ జనకంగా రైతన్నలు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఏదైనా శుభకార్యమైన అశుభకార్యమైన ముందుగా సమర్పించేది తాంబూలం. అలాంటి తాంబూలానికి అవసరమైన తమలపాకులు నానాటికి కనుమరుగవుతున్నాయి. దీంతో సాగు విస్తీర్ణం కూడా తరిగిపోతుంది పైగా ధరలు కూడా లేకపోవడంతో రైతుల నిరాశ జనకంగా మారుతున్నారు. అంతేకాకుండా పండించిన మార్కెట్‌కు పంపేందుకు రవాణా సౌకర్యం లేకపోవడం తీవ్ర ఇబ్బందిగా తయారైంది. రైతులు తమలపాకు సాగుకు అలవాటు పడి ప్రత్యామ్నాయ పంట సాగు చేయలేక తమలపాకు తోటలనే నమ్ముకుని తోటలు పెంచుతుంటే ఆశించిన ఫలితాలు లేక సాగు రైతులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. పంట సరిగా రాక దిగులు పడుతున్నారు. కేవలం వర్షాధారం పైనే ఆధారపడి సాగు చేయాల్సిన రైతులు వర్షం కురవపోతుందా అనుకుంటూ తన పంట సాగును కొనసాగిస్తున్నారు.

**ప్రస్తుతం తోటల పరిస్థితి :** ప్రస్తుత పరిస్థితులలో వర్షాభావ పరిస్థితుల వల్ల సాగునీరు సరిగా లేక తోటలో ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదని సాగు రైతులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ సౌకర్యం లేనందున తమలపాకు తోటలు సాగు చేసే విస్తీర్ణం కూడా పూర్తిగా తగ్గిపోయింది. ఎక్కడో అరకొరగా ఈ పంటను సాగు చేస్తున్నారు. సాగు చేసిన పంట కూడా స్థానిక మార్కెట్లలో అమ్ముకునేందుకు అవకాశాన్ని వెతుక్కుంటున్నారు. చుట్టుపక్కల గ్రామాలలో ఈ ఆకుల కట్టలను ఆర్టీసీ బస్సుల ద్వారా రవాణా చేస్తున్నారు.

**గతంలో తమలపాకు సాగు పరిస్థితి :** గతంలో వింజమూరు మండలంలో సుమారు ఐదు నుండి 600 ఎకరాలు సాగులో ఉండేది ప్రస్తుతం కేవలం సుమారు 20 ఎకరాల లోపుగా ఉంటుందని రైతుల తెలియజేస్తున్నారు. గతంలో వింజమూరు, ఆత్మకూరు, కలువాయి, ఏఎస్పేట, కోవూరు, ఇందుకూరుపేట తదితర ప్రాంతాలలో అధికంగా సాగు చేసేవారు. ప్రస్తుత పరిస్థితుల ప్రభావం వల్ల కేవలం కొంతమేరకే పరిమిత మైంది. అనేక కారణాలతో విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది.



**మార్కెట్ సౌకర్యం :** గతంలో వింజమూరు నుండి రోజుకు సుమారు ఐదు లేదా ఆరు లారీల తమలపాకుల బుట్టలు ఎగుమతి అయ్యేవి రాష్ట్రంలోనే కర్నూలు, తెలంగాణలోని వరంగల్, మహబూబ్నగర్, కరీంనగర్ తదితర పట్టణాలకు పంపేవారు. ఇవే కాకుండా మహారాష్ట్ర కర్ణాటక గుజరాత్ ఒరిస్సా కలకత్తా ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతి అయ్యేవి ఇప్పటికి కూడా కలకత్తాలో ఈ ప్రాంత తమలపాకులకు మంచి డిమాండ్ ఉంది. కానీ మార్కెట్ సౌకర్యం లేక రైతులు పంట సాగును కుదించుకున్నారు.

**ప్రస్తుతం సాగు విస్తీర్ణం :** వింజమూరులో సుమారు 20 ఎకరాలు కలువాయిలో 40 ఎకరాలు కోవూరులో 70 ఎకరాలు తాటిపర్తిలో ఇరవై ఎకరాలు ఇనమడుగు కేంద్రంగా సుమారు 100 ఎకరాల తమలపాకు తోటలు సాగులో ఉన్నట్లు అంచనా.

**సాగు ఖర్చు :** తమలపాకు తోట ఒక ఎకరా సాగు చేయాలంటే సుమారు మూడు లక్షల వరకు ఖర్చు అవుతుందని రైతులు తెలియజేస్తున్నారు. దిగుబడి కూడా నీటి సరఫరా ఉండి పంట సరిగా వచ్చినట్లయితే ఆదాయం కూడా రెట్టింపుగా ఉంటుందని తెలిపారు. కానీ నీటి వనరులు లేక వర్షాలు సరిగా కురవక పోవడంతో పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. అలాగే వచ్చిన దిగుబడి కూడా అమ్ముకునే సౌకర్యం లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలియజేస్తున్నారు.

**సాగుపై తగ్గిన ఆసక్తి :** ప్రస్తుతం తమలపాకు తోట పై రైతులు ఆసక్తి చూపడం లేదు ఒకవైపు వర్షాలు లేక పోవడం మరోవైపు మార్కెట్ సౌకర్యం లేకపోవడం రవాణా లేకపోవడం అంతకుమించి ప్రభుత్వ ప్రోత్సాహం కరువైందని దీంతో రైతుల తమలపాక తోటలను పెంచడం నిలిపివేస్తున్నారు. ఉద్యాన శాఖ ఉన్నప్పటికీ ఎక్కడ ఆ శాఖ అధికారులు రైతులకు కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉందని కొందరు రైతులు అంటున్నారు. ఎప్పుడైనా రైతులను కలిసి పలానా పంట సాగు చేయాలని తెలిపిన సంఘటనలు లేవని అసలు అధికారులు ఉన్నారా లేరా అని అనుమానం కలుగుతుందని కొందరు రైతులు తెలియజేస్తున్నారు.

## తమలపాక తోటల వల్ల పలువురికి ఉపాధి : రైతు తిరుపతయ్య



తమలపాకులు అధిక శాతం విస్తీర్ణంలో సాగు చేసినట్లయితే వందలాదిమంది కూలీలకు ఉపాధి కల్పించినట్లు అవుతుంది. అలాగే వాహన సౌకర్యం ఉన్నట్లయితే వాహనాల ద్వారా వచ్చే పన్ను చెల్లింపులు అలాగే ప్రభుత్వ వాహనాలు ఉన్నట్లయితే ఆ వాహన చెల్లింపులు దీని ద్వారా ప్రభుత్వానికి కొంతమేర ఆదాయం వస్తుంది. అలాగే బుట్టలు అల్లడం వల్ల కొంతమంది బుట్టలమ్మే వారికి ఉపాధి కలుగుతుంది. ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ కొందరికి ఈ పంట సాగు వల్ల ఉపాధి కలుగుతుందనేది వాస్తవం కావున ప్రభుత్వ అధికారులు ఈ సాగు పట్ల రైతులను ప్రోత్సహించి సాగు పెరిగేందుకు కృషి చేసినట్లయితే అన్ని విధాలుగా మేలుగా ఉంటుందని పలువురు రైతులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

---

# 25 సంవత్సరాలకు.. పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు

### ఘనంగా సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ వేడుకలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** 25 సంవత్సరాలకు పూర్వ విద్యార్థులు ఒక వేదికపైకి కలుసుకున్నారు. ఈ వేదిక ముత్తుకూరు జడ్పీ హైస్కూలు. సుదీర్ఘకాలం తర్వాత చదువుకున్న స్కూలుకు చేరుకున్న పూర్వ విద్యార్థులు ఒకరికొకరు పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. హై స్కూల్లో చదువుకున్న 1999-2000 విద్యా సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థిని విద్యార్థులు సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ రీ యూనియన్ ఆఫ్ క్లాస్ టెన్త్ కార్యక్రమం ఘనంగా చేశారు. 25 సంవత్సరాల క్రితం విద్య బోధించిన గురువులను వెతికి పట్టుకొని ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆహ్వానించారు. పేరుపేరునా వారికి ఆహ్వానం పలుకుతూ వేదికపై తీసుకు వచ్చి సాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి పాదాభివందనం చేసి ఆశీస్సులు పొంది జ్ఞాపికలు అందజేశారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తమ చదువుకున్న హైస్కూల్ ఆవరణంలో గడిపారు. తమ కుటుంబ సభ్యులతో చేరుకుని పరిచయాలు చేసుకున్నారు. తమ వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థులు అనేక రంగాల్లో స్థిరపడి ఉండడం విని చెప్పిన గురువులు సంతోష పడిపోయారు. పూర్వ విద్యార్థులు తమ జీవిత అనుభవాలు వివరించుకున్నారు. గురువులు చెప్పిన చదువు జీవితానికి అర్థం చేకూర్చిందని ప్రసంశించినారు. ప్రస్తుతం చేస్తున్న వృత్తి ఏమిటి, జీవన శైలి ఏ విధంగా ఉంది, ఆర్థిక సంపదతోపాటు తదితర విషయాలు తెలియపరిచారు. గురువులను చూసి పూర్వ విద్యార్థులు, పూర్వ విద్యార్థులను చూసి గురువులు ఉప్పొంగిపోయినారు. ఘనంగా జరిగిన ఈ వేడుకల్లో అందరూ కలిసి ఆత్మీయ విందు పొందారు.

### ఘనంగా ఎంకేఎస్..
## పాఠశాల వార్షికోత్సవం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం అక్కరాజు వారి కండ్రిక ఎంకేఎస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఏడవ వార్షికోత్సవం కార్యక్రమం శనివారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రారంభించిన నాటినుండి నేటి వరకు గత ఏడు సంవత్సరాల నుండి మండలంలో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యం మెమొంటోలను నగదు బహుమతులతో సత్కరించారు. పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతోపాటు ప్రముఖ ఇంజనీరింగ్‌లలో జేఈఈ మెయిన్స్ పోటీ పరీక్షలలో ఎంకెఎస్ పాఠశాల విద్యార్థులు విజయ్ కేతనం ఎగరవేశారని తెలిపారు. మండలంలో ఎంకేఎస్ స్కూల్ విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు పాఠశాల అధ్యాపకులు నిరంతరం కృషి చేస్తున్నారననీ పాఠశాల కరస్పాండెంట్ సాధనాల మనోహర్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ మండల కన్వీనర్‌గా ఇస్కా మదన్ మోహన్ రెడ్డి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** వైయస్సార్సీపి జలదంకి మండలం కన్వీనర్‌గా ఇస్కా మదన్మోహన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వైయస్ఆర్సీపీ జలదంకి మండల కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదల చేశారు. మండల పార్టీ ఉపాధ్యక్షులుగా కమ్మవారిపాలెం సర్పంచ్ తమ్మినేని సతీష్ నాయుడు, చిన్నక్రాక నాయకులు వట్టికాల బాలయ్యలు నియమితులయ్యారు. ట్రెజరర్‌గా గోపన పాలెం సర్పంచ్ గండు వెంకారెడ్డి, కార్యదర్శులుగా వెలమూరి చైతన్య రెడ్డి, పుచకట్ల వెంకటేశ్వర్లు, వట్టికాల వరకుమారీ, ఒంటేరు లక్ష్మీ నరసారెడ్డి, గుమ్మిడి రమేష్, కమిటీ మెంబర్లు ఎంపీకయ్యారు. ఈ సందర్భంగా కన్వీనర్ మదన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. తనకు భాధ్యత అప్పగించిన ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని తెలియజేశారు.

## ఈదురు గాలులకు తెగిపడిన కరెంటు వైర్లు

- త్వరితగతిన పూర్తిచేసిన సిబ్బంది



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని తోటపల్లి గూడూరు పరిసర ప్రాంతాలలో కరెంటు అంతరాయం ఏర్పడింది. ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలుల వల్ల హై టెన్షన్ వైర్లు తెగిపడడంతో లైన్మేన్ ఫణీంద్ర అప్రమత్తమై కరెంటు నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం జేఎల్ఎం బాబు నవీన్‌లతో కలిసి మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యుత్ అంతరాయం లేకుండా చేశారు. లైన్మేన్ ఫణీంద్ర అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రారంభమైన ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్‌బాల్ టోర్నీ

## 97 జట్లు, 93 మ్యాచ్‌లు.. తొలిరోజే 30 పోటీలు




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వేదికగా అఖిల భారత ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ (పురుషుల) టోర్న మెంట్ శనివారం వైభవంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (శాప్) ఛైర్మన్ అనిమిని రవి నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అధ్యక్ష తన వేడుకలు నిర్వహించ బడ్డాయి. దేశవ్యాప్తం గా ఉన్న వివిధ విశ్వవిద్యాలయాల నుండి వచ్చిన 97 జట్లు ఈ పోటీలో భాగంగా 93 మ్యాచ్‌ల్లో తలపడనున్నాయి. తొలిరోజు 30 మ్యాచ్‌లు జర గగా, ఈ టోర్నమెంట్ ఐదు రోజుల పాటు జరగ నుంది. నాక్ అవుట్ పద్ధతిలో జరిగే ఈ పోటీలో చివరకు నాలుగు జట్లు లీగ్ దశకు అర్హత పొంద నున్నాయి. ఈ సందర్భంగా ఉపకులపతి శ్రీని వాసరావు మాట్లాడుతూ.. మహిళల సాఫ్ట్‌బాల్ టోర్నీని విజయవంతంగా నిర్వహించిన అనుభ వంతోనే ఇప్పుడు పురుషుల విభాగాన్ని కూడా ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్రీడలు గెలుపోటములతో సంబంధం లేకుండా విద్యా ర్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని, విలువలను పెంపొం దించేందుకు కీలకంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. శాప్ ఛైర్మన్ రవి నాయుడు మాట్లా డుతూ.. యువతకు అవకాశాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అధిక ప్రాధాన్య తనిస్తున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నేతృత్వంలో యువ క్రీడాకారుల ప్రతిభను దేశ స్థాయిలో నిలబెట్టేందుకు ప్రభు త్వం అన్ని రకాల మద్దతు అందిస్తున్నదని వివరిం చారు. టోర్నీలో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు ఉత్త మ ప్రదర్శన ఇవ్వాలని ఆకాంక్షించారు. టోర్న మెంట్ నిర్వహణలో వర్సిటీ ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, అధ్యాపకులు, సిబ్బంది, వివిధ యూనివర్శిటీల కోచ్‌లు, అంపైర్లు, రిఫరీలు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# విద్యార్థుల్లోని సృనాత్మకతను వెలికి తీసేది ఆర్ట్ కళ




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు పేపర్ ఆర్ట్ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి జి కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పేపర్ పై ఆర్టు వేయడం పై పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు పోటీలు పడి చిత్రాలు గీయడం చేశారు పేపర్ ఆర్ట్ అనేది విద్యార్థి యొక్క మానసిక నైపుణ్యత పై ఆధారపడి ఉంటుంది. చురుకైన విద్యార్థి తన మనసును సమాజంపై మరల్చి సమాజంలో జరుగుతున్న ప్రస్తుత అంశాలను ఊహించుకొని ఆ అంశాలను సంఘటనగా మార్చుకొని చిత్రాన్ని గీయడం ఈ ఆర్ట్ లోని గొప్పతనం ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడం జరుగుతుంది. తనలో ఉన్న నైపుణ్యతను తెలుసుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి ఇలాంటి పోటీలు విద్యార్థి దశ నుండే అలవర్చుకున్నట్లయితే భవిష్యత్తులో మంచి కళాకారునిగా రాణించగలడు కావున విద్యార్థులు చిన్నతనం నుండే పలు విభాగాలకు చెందిన నైపుణ్యతను పెంపొందించుకోవలసిన అవసరం ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉన్నారు.

# టీడీపీ కార్యాలయంలో అతిరథ మహారధులు

## అపూర్వ స్వాగతం పలికిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండల కేంద్రంలోని బొమ్మ రాజు చెరువు సమీపంలో ఉన్న తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో, ఆదివారం అతిరథ మహారధులు కొలువుదీరారు. వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డి పల్లి గ్రామంలో నూతనంగా అత్యంత సుందరంగా నిర్మించిన గ్రామ దేవత శ్రీ అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకొని, అక్కడికి వెళ్లే క్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణ రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్, పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. వారందరికీ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అపూర్వ స్వాగతం పలికారు. శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యాలయంలో కొద్దిసేపు ముచ్చటించుకుని ఆ తర్వాత శ్రీ అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామి రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ పొన్నుబోయిన చంచల బాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మాజీ పోలీస్ హౌసింగ్ సొసైటీ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవి రెడ్డి, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, కాకర్ల వెంకట్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, సీనియర్ నాయకులు గణపం సుదర్శన్ రెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు, వనిపెంట సుబ్బారెడ్డి, జూపల్లి రాజారావు, దాట్ల కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

## రామానాయుడుపల్లిలో బంగారమ్మకు పొంగళ్ళు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని రామానాయుడుపల్లి గ్రామంలో బంగారమ్మ ఆలయం వద్ద ఆదివారం గ్రామస్తులు పొంగళ్ళు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాసాల నుండి పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనం తరం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని మహిళలు ఊరేగింపుగా బయలుదేరి ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్ళు పొంగించి తమ గ్రామం పాడిపంటలతో వర్ధిల్లాలని దీవించాలని కోరుకున్నారు. అలా ఉన్నట్లయితే ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తామని మొక్కుకున్నారు. వేదమంత్రాలతో ఈ పొంగళ్ళు ఘనంగా నిర్వహించారు.

## మర్రిపాడులో టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్డుల పంపిణీ చేయుట కార్యక్రమంలో భాగంగా మర్రిపాడు బీసీ కాలనీలో ఆదివారం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని తెలియజేశారు. అలాగే మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత నాయకులు ముప్పాళ్ల వెంకట చౌదరి, గంగినేనీ, శ్రీనివాసులు, మాలపాటి వెంకటేశ్వర్లు, తోడేటి నరేష్, కన్నెలూరి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనంకు ఘన స్వాగతం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికు మండలంలోని హసనాపురం గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు హసనాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని మండల టిడిపి కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఆనంకు మహిళలు హారతి ఇచ్చారు. అలాగే పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించి బొకేలను అందజేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు మంత్రి ఆనంను సత్కరించారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు కాటంరెడ్డి రవీంద్రారెడ్డి మండల టీడీపీ నాయకులు అబ్బూరి రమేష్ నాయుడు కాటంరెడ్డి నర్సింహారెడ్డి పులిమి సుధాకర్ రెడ్డి ఏలూరి మాల్యాద్రి నాయుడు మాధవరెడ్డి పైడి శ్రీనివాసులు వెంకటేశ్వర్లు పెట్రోల్ బంక్ నిర్వాహకులు వెంగల్ రెడ్డి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య పాత్రికేయులను సన్మానించిన ఆర్యవైశ్య సంఘం




**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక మున్సిపల్ ప్లాట్స్‌లో ఉన్న ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు తటవర్తి రమేష్, వారి కమిటీ సభ్యులు వారి కార్యాలయంలో కావలి పట్టణంలో పాత్రికేయులుగా పనిచేయుచున్న ఆర్యవైశ్య పాత్రికేయులను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షులు తటవర్తి రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిదిగా పనిచేస్తూ ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడుతున్న పాత్రికేయులను ఈ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా దీనిని సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందని నీతి, నిజాయితీగా సమాజంలో ఉండే చెడును అధికారులకు తెలియజేస్తూ, వారి సమస్యలపై పోరాడుతూ నిరంతరం శ్రమించే వ్యక్తులే ఈ పాత్రికేయులని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్న బ్రహ్మోత్సవ సేవ కమిటీ సభ్యులు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్నవాడ గ్రామంలో వెలసి ప్రముఖ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న శ్రీ స్వామి అమ్మవార్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన బ్రహ్మోత్సవ సేవ కమిటీ సభ్యులు ఆదివారం శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డివారిని స్వాగతించి శ్రీ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. బ్రహ్మోత్సవ సేవా కమిటీ సభ్యులుగా ఎంపిక చేసిన కోవూరు ఎమ్మెల్యేవేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సేవాకమిటీలో తిరువూరు అశోక్ రెడ్డి, కనపర్తి నాగేంద్ర, నక్కల శివకృష్ణ, తిరువాయిపాటి నందకుమార్, ముంగర సుధాకర్, శ్రీశైలం శశి శేఖర్ శర్మ (అర్చక), పాలూరు చాముండేశ్వరి, కొల్లపూడి శారద, పెన్నతూరు సుమలత, గంద్రకోట రమాదేవి, జొన్నలగడ్డ వరలక్ష్మి, ఇమ్మడిశెట్టి సౌజన్య లక్ష్మి గార్లు సభ్యులుగా ఉన్నారు. వీరు మే 17 నుంచి 27 వరకు జరగనున్న అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో సేవలు అందించనున్నారని సహాయ కమీషనర్, కార్యనిర్వహణాధికారి తెలిపారు.

## గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న ప్రసన్న



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం మండలం దామరమడుగు గ్రామంలో గత ప్రభుత్వములో గ్రామవాలంటరీగా విధులు నిర్వహించిన పట్టాభి పవిత్ర-పట్టాభి వినయ్‌ల నూతన గృహప్రవేశంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర అధికారప్రతి నిధి, రాష్ట్ర వైసీపీ పీఏసీ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం మండల పార్టీ అధ్యక్షులు చెర్లో సతీష్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు కలువ బాలశంకర్ రెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలోఉన్న పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలుజరిగాయి. ఈ కార్యక్రమంలో తొలుత గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల మహాత్మా గాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రం, నూలుమాల ఆశ్రమ స్థలదాత పొనక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రం, నూలుమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# రేషన్‌కార్డులు, పెన్షన్ల కోసం ఎదురుచూపులు

- ప్రభుత్వం నుండి విడుదల కాని ఉత్తర్వులు
- నిబంధనలు సడలించాలంటున్న జనాలు
- మంత్రి నాదెండ్ల ప్రకటనతో ఆశలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నూతనంగా రేషన్‌కార్డులు, వివిద రకాల పెన్షన్లకు అర్హులైన వారు ప్రభుత్వ ఆదేశాలు, ఉత్తర్వులకోసం ఎదురు చూస్తున్నారు. తాజాగా రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ త్వరలో రేషన్‌కార్డులంటూ చేసిన ప్రకటనతో జనాల్లో ఆశలు రేగాయి. అయితే నిబంధనలు సడలించాలని కోరుతున్నారు. రేషన్‌కార్డులు, పెన్షన్లకోసం దరఖాస్తులు చేసుకోవాలంటూ సోషల్‌మీడియాలో అప్పుడప్పుడూ కన్పిస్తుందేకానీ ఇంకా ప్రభుత్వం తగిన ఉత్తర్వులివ్వలేదు. అర్హతల నియమావళిని కూడా విడుదల చేయలేదు. అయితే వివిద పెన్షన్లు, రేషన్‌కార్డులు, సంక్షేమకార్యక్రమాల మంజూరులో అర్హులందరికీ న్యాయం చేయాలని, గతప్రభుత్వంలోఉన్న నిబంధనలను సడలించాలని వివిద వర్గాల ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలు అమలు చేస్తే ఇబ్బందికరమని కొందరు, కొన్ని నిర్ణయాలు అమలుచేయకుంటే ఇబ్బందికరమని మరికొందరు అభిప్రాయపడ్డారు. 20సంవత్సరాలకు క్రితం ప్రభుత్వం డిఫారం పట్టాగా రైతులకు ఇచ్చిఉంటే అలాంటివారికి ఫ్రీహోల్డ్ అంటూ వైసిపి ప్రభుత్వం పలువురు రైతులకు ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ఈ సర్టిఫికేట్ ద్వారా ఆ భూములను విక్రయించుకోవచ్చని, రిజిస్టర్ చేసుకోవచ్చని నిర్ణయించారు. దాదాపు ఏడాదిన్నరక్రితం ఈ సర్టిఫికేట్లు ఇవ్వడంతోపాటు ఆన్‌లైన్‌లో ఆయా పొలాలకు సంబంధించి గత ఏడాది ఫ్రీహోల్డ్ చేయబడిందని నమోదు చేశారు. కానీ తీరా చూస్తే ఈ నూతన ప్రభుత్వం ఫ్రోహోల్డ్ అంశాన్ని పెండింగ్‌లో ఉంచింది. దాంతో ఆ సర్టిఫికేట్లు పొందిన రైతులు తీవ్ర నిరాశకుగురై ఆవేదన చెందుతున్నారు. తమకు 20సంవత్సరాలకు ముందు ఇచ్చిన డిఫారం పట్టాలు శాశ్వతపట్టాలుగా మారనున్నాయని సంబరపడ్డ రైతులు దిగాలు చెంది ఉన్నారు. ప్రభుత్వం ఈవిషయమై పరిశీలించిన కొత్తగా ఇవ్వకున్నా ఇప్పటివరకు ఇచ్చిన ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు ఇచ్చివారికి చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

### పెన్షన్లకు గత ప్రభుత్వ నియమాలు పాటించవద్దు

వివిద రకాల పెన్షన్ల కొనసాగింపు, మంజూరుకు గత వైసిపి ప్రభుత్వ నియమాలు అమలుచేయవద్దని, చాలామంది తీవ్రంగా నష్టపోతారని అనేకమంది పెన్షనర్లు, పెన్షన్‌కు అర్హులైనవారు కోరుతున్నారు. గత ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువనున్న రైస్‌కార్డుదారులందరూ అర్హులు కాగా విద్యుత్ వినియోగం నెలకు 300యూనిట్లుకన్నా అధికంగా ఉందని, ఇంటికొలతలు అధికంగా ఉన్నాయని, నాలుగుచక్రాల వాహనాలున్నాయని, కుటుంబసభ్యులు ఆదాయపన్నులు చెల్లిస్తున్నారంటూ అనేకమందిని అనర్హులుగా చేసి పెన్షన్‌లు రద్దుచేశారు. అర్హులు నూతనంగా దరఖాస్తులు చేసుకునే అవకాశం లేకుండా చేశారు. దాంతో అందరూ లబోదిబో అంటూ తీవ్ర ఆవేదనకు గురికాగా పెన్షన్లను రద్దుచేసి పలువురికి వైసిపి ప్రభుత్వం అన్యాయం చేస్తుందంటూ తెలుగుదేశం నాయకులు గగ్గోలు పెట్టారు. కాగా రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం అదే నియమాలను అమలుచేయనుందని, అనర్హులంటూ పలువరి పెన్షన్లకు ముప్పురానుందని, కొత్తగా పెన్షన్ల మంజూరుకు గత నిర్ణయాలు, నియమాలు పాటించనున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గత నిర్ణయాలు అమలు ఉంటుందా లేదా, తాజా నిర్ణయాలా అనేది ప్రభుత్వం నుండి సచివాలయాకు ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదంటున్నారు. ఏదేమైనా అర్హులకు నియమావళి అంటూ రైస్‌కార్డుదారులకు నూతన పెన్షన్లు మంజూరుకాకున్నా, ప్రస్తుతం ఉన్న పెన్షన్లు రద్దయినా అనేకమంది నష్టపోయేపరిస్థితి, ఆందోళనకుగురయ్యే పరిస్థితి, అలజడి చెలరేగే పరిస్థితి ఉంటుందని, ప్రభుత్వం పునరాలాలోచించి గతంలో తెలుగుదేశం అమలుచేసిన నియమావళినే ప్రాతిపదికన తీసుకోవాలని, వైసిపి నియమాలు అమలుచేయరాదని, సాధారణ,మద్య తరగతి కుటుంబాలవారు కూడా విద్యుత్ 300యూనిట్లకన్నా అధికారంగా వినియోగించుకునే పరిస్థితి ఉంటుందని, బిడ్డలు చదువుకుంటూ కనీస అవసరాలను వాడుకూటుంటారని, అలాంటివారిని గమనించాలని, ఆంక్షలపేరుతో పెన్షన్లు రద్దుచేయారాదని అనేకమంది కోరుతున్నారు.

### టిడ్కోగృహాలు మంజూరైనవారికి పట్టాలివ్వాలి

గతంలో తెలుగుదేశం ప్రభుత్వహయాంలో నిర్మించిన టిడ్కోగృహాల నిర్మాణాలను పూర్తిచేసి లాటరీ విధానంలో లబ్దిదారులకు కేటాయించారు. గత వైసిపి ప్రభుత్వం వాటిని గురించి పట్టించుకొనకుండా ఎన్నికలు సమీపించే పరిస్థితిలో మళ్ళీ గృహాలను కేటాయించారు. అయితే ఆత్మకూరులో చూస్తుంటే 1050 గృహాలు కాగా ఇప్పటివరకు ఐదారువందలమంది అక్కడకు నివాసాలు మార్చుకున్నారు. గతంలో చెప్పిన విధంగా అక్కడ గుడి, చర్చి, మశీదు, పార్కు, స్కూలు, అంగన్‌వాడీ కేంద్రం తదితరాలను ఏర్పాటు చేస్తామని తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించారు. పార్కుకు సంబంధించి మెటీరియల్ కూడా అక్కడకు చేర్చారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటి గురించి ఆలోచించిన పాపానపోలేదు. కాగా కొన్ని గృహాలు ఖాళీలుండగా అర్హులు కొందరు దరఖాస్తు చేసుకున్నారు. విఆర్వో, కమీషనర్,ఆర్డీవోల అర్హులుగా ఆమోదించి ఫైనల్‌గా జాయింట్ కలెక్టర్‌కు ప్రాతిపాదించగా అక్కడ కూడా ఆమోదం పొంది గృహాలు మంజూరయ్యాయి. అయితే వారికి పట్టాలిచ్చే సమయానికి రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. పట్టాపుస్తకాలపై గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫోటోలున్నాయని అధికారులు నిలిపివేశారు. ఈ ప్రభుత్వం ఆపాస్‌బుక్‌లను మార్చి లబ్దిదారులకు పట్టాలివ్వాలని కోరుతున్నారు. ఈవిషయమై ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

# కనిగిరి రిజర్వాయర్ నుంచి రెండో పంటకు నీటి విడుదల

- చివరి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేయాలి
- నీటి వృధాని అరికట్టి నీళ్లు పొదుపుగా వినియోగించండి
- పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా వుండాలి
- నీటి విడుదల.. వరుణుడు కరుణించడం శుభసూచకం
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో రైతులు సుభిక్షంగా వున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ సందర్భంగా కోవూరు నియోజకవర్గ రైతాంగ నారుమళ్ల అవసరాల కోసం ఆమె కనిగిరి రిజర్వాయర్ క్రస్ట్ గేట్లుఎత్తి ఈస్ట్రన్ ఛానల్, సదరన్ ఛానల్స్‌కు నీళ్లు విడుదల చేశారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. కనిగిరి రిజర్వాయర్ నుంచి నీటి విడుదల సందర్భముగావరుణుడు కరుణించి వర్షం పడడంశుభ సూచకమన్నారు.గత సంవత్సరం కోవూరు నియోజకవర్గ రైతులు అధిక దిగుబడులుసాధించడం సంతోషంగావుందన్నారు. గిట్టుబాటు ధరతో పాటు గతమెన్నడూ లేని విధంగా ధాన్యం అమ్మిన 24 గంటలలోనే హమాలీ చార్జీలతో సహా రైతుల ఖాతాలలో జమచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన 11 నెలల వ్యవధిలో కనిగిరి రిజర్వాయర్ నుంచి రెండు సార్లు నీళ్లు విడుదల చేయడంపట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. కనిగిరి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.7 టీఎంసీల నీళ్లువున్నాయని రెండో పంటకు ఎటువంటి యిబ్బంది రాదన్నారు. ఇరిగేషన్ అధికారులు, సాగునీటి సంఘ అధ్యక్షులు పరస్పర సమన్వయంతో చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు కృషి చేయలన్నారు. నీటి వృధాని అరికట్టి నీళ్లు పొదుపుగా వాడుకోవాలని రైతులకు సూచించారు. దేవుడు అనుగ్రహంతో పంటలు బాగాపండి కోవూరు నియోజకవర్గ రైతులు సుభిక్షంగా వుండాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెన్నాడెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి, ఇరిగేషన్ ఏఈ, డీఈలు ఎన్.వెంకట ప్రసాద్, వై.పెంచలయ్య, బుచ్చి మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు పుట్టా లక్ష్మీకాంతమ్మ, లలితమ్మతాళ్ల వైష్ణవి, చీర్ల ప్రసాద్, పలువురు నీటి సంఘఅధ్యక్షులు డైరెక్టర్లతోపాటు టీడీపీ నాయకులు బత్తల హరికృష్ణ, ఎంవి శేషయ్య, శివయ్య నాయుడు యర్రంరెడ్డి గోవర్ధనరెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, సూరా శ్రీనివాసులు రెడ్డి, ఏటూరి శివరామక్రిష్ణా రెడ్డి, మోర్ల మురళి, పటేల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ బంకును ప్రారంభించిన మంత్రి ఆనం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం హసనాపురంలో ప్రధాన రహదారి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌వీవీఎన్ హెచ్‌పీసీఎల్, పెట్రోల్ బంకును రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను వినియోగదారులకు అందించాలని పెట్రోల్ బంక్ నిర్వాహకులు నూకరాజు వెంగల్ రెడ్డికి, చిన్నపురెడ్డి గోపాల్ రెడ్డికి, మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు కాటంరెడ్డి రవీంద్రారెడ్డి రాజోలు సొసైటీ మాజీ అధ్యక్షులు కాటంరెడ్డి నరసింహారెడ్డి, టీడీపీ మండల నాయకులు నంది వివేకానంద రెడ్డి ఏలూరి మాలాద్రి నాయుడు పులిమి సుధాకర్ రెడ్డి అల్లంపాటి మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఖాదర్ బాషా, బాబు, ఎంపీపీ పద్మజా రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు కోటిరెడ్డి జనార్దన్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు చెంచులు రెడ్డి, పెట్రోల్ బంక్ నిర్వాహకులు నూకరాజు, పెద్ద వెంగల్ రెడ్డి, చిన్న వెంగల్ రెడ్డి, కుటుంబ సభ్యులు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండ రామస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం గట్టుపల్లి పంచాయతీ చింతలపాలెం గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ముందుగా పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ కాకర్ల సురేష్ కి పురోహితులు ఆశీర్వాదాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి, చింతలపాలెం టీడీపీ నాయకులు మనోజ్ కుమార్, జలదంకి మండలం నాయకులు గ్రామ నాయకులు భక్తులు తదితరులు ఉన్నారు.

## హిందూ సనాతనధర్మ పరిక్షణకై పాదయాత్ర



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** హిందూ సనాతనధర్మంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు పరిక్షణకై పాదయాత్ర చేపడుతున్నట్లు లక్ష్మీపతిస్వామిజీ పేర్కొన్నారు. నవంబరు 1.2016లో కర్ణాటక రాష్ట్రం ఉడిపిలో చేపట్టిన పాదయాత్ర ఆదివారం ఉదయగిరికి చేరుకొంది. స్థానిక విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి స్వాగతించి పాదయాత్ర విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిస్వామిజీ విలేఖరులతో మాట్లాడుతూ.. సనాతన ధర్మంపై ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. రోజుకు 35 కిలోమీటర్లు నడుస్తూ కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాల మీదుగా అయోధ్యకు చేరుకుని శ్రీరాముని దర్శించుకున్నట్లు తెలిపారు. తిరిగి తన స్వగ్రామమైన ఉడిపికి పాదయాత్ర చేస్తూ వెళుతూ ఉదయగిరికి చేరుకొన్నానన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు శ్రీనివాస రావు, విప్లావుకు మాద్రెడ్డి, గురవయ్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షంతో కాస్త ఉపశమనం



**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో రోజురోజుకు ఎండలు మండిపోతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. భానుడి ప్రతాపం రోజురోజుకు పెరగడంతో జనం అల్లాడిపోయారు. గత మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు మరీ ఎక్కువయ్యాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండవేడికి అల్లాడారు. మధ్యాహ్నం పూట రోడ్డు కూడళ్ళు నిర్మానుషంగా దర్శనమిచ్చాయి. నగరంలో చెట్ల నీడ లేక జనం అల్లాడుతున్నారు. రోడ్ల వెంబడి దుకాణాలు నిర్వహించే చిరు వ్యాపారులు ఎండ తీవ్రతను తట్టుకోలేక సతమతమయ్యారు. వృద్ధుల పరిస్దితి మరీ దయనీయం. జనం లేక వ్యాపారాలు సక్రమంగా సాగక, వ్యాపారులు తీవ్ర అవస్థలు పడడం గమనార్హం. కొన్ని ప్రాంతాల్లో జనం లేక రోడ్లు బోసి పోయాయి. నగరంలో పూర్తిస్థాయిలో చెట్లు లేకపోవడంతో నిలవ నీడ లేక ప్రజల పడిన అవస్థలు వర్ణనాతీతం. నగరంలోని మద్రాస్ బస్టాండు, మినీ బైపాస్, పొదలకూరు రోడ్డు, డైకాస్ రోడ్డు, పెద్ద బజారు, కాపు వీధి, వేదాయపాలెం, స్టోన్ హౌస్ పేట ఇలా, పలు ప్రాంతాల్లో చెట్టు నీడ లేక ప్రజలు అవస్థలు పడడం గమనార్హం. కాగా, ఆదివారం ఒక్కసారిగా వాతావరణం మారి గాలి, వర్షంతో చల్లబడంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. ఎండ వేడి తట్టుకోలేకపోతున్న ప్రజలకు ఈ చల్లదనం కొంత ఉపశమనం కలిగించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షమే కురిసింది. దీంతో నగర ప్రజలకు కొంత ఊరట లభించినట్లయింది. వర్షం వల్ల దెబ్బతిన్న పొదలకూరు రోడ్లు ప్రాంతంలో వర్షపు నీరు చేరి రోడ్డు అంత దుర్భరంగా మారడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు.

**నగరంలో పచ్చదనం కొరత :** జిల్లాలో అధికారులు ముందుచూపుతో వ్యవహరించని కారణంగా ప్రతిసారి వేసవికాలంలో ప్రజలు చెట్ల నీడ కోసం అల్లాడాల్సిన పరిస్థితి ఏర్పడుతూనే ఉంది. ఇటు నగరపాలక సంస్థ, అటు సోషల్ ఫారెస్ట్ అధికారులు చెట్ల పెంపకం పై దృష్టి పెట్టకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రోడ్లు విస్తరణ పేరుతో ఉన్న చెట్లను తొలగిస్తున్నారు తప్ప వాటి స్థానంలో చెట్లు పెంచుకోక పోవడంతో వేసవికాలంలో నీడ లేక ప్రజలు అవస్థలు పడుతూనే ఉన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నగరంలో పూర్తిస్థాయిలో మొక్కలను నాటించాల్సి ఉందనేది ప్రజల అభిప్రాయంగా ఉంది.